వ్యాస కౌముది



# తెలుగు తానీషా యస్వీ జోగారావు

## డా. శిరీష ఈడ్పుగంటి

**తెలుగు తానీషాగా** పిలువబడిన యస్వీ జోగారావుగారు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషలను అవపోశనము పట్టిన అపర భగీరథుడు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియాలలో ఈయన చేయి కనిపిస్తుంది. పద్యం, గద్యం, ఛందస్సు, నవల, నాటకం, కథ, జానపదవాఙ్మయం, భాషాశాస్త్రం, యక్షగానం, అనువాదం, వ్యాకరణం, కవిత్వం, తదితర అంశాలన్నింటిలోనూ ఈయనకు ప్రవేశముంది. అన్నింటియందు వీరి రచనలు కనిపిస్తాయి. వీరెంత ప్రాచీనులో అంత నవీనులు. పద్యరచనలో ఎంత సమర్థులో గద్యరచనలో కూడా అంత సిద్ధహస్తులు. తెలుగులో 'ఊహాప్రహేళిక' అనే సాహిత్యప్రక్రియ ఈయన అపూర్వ సృష్టి. ఈయన విజయనగరం జిల్లా, పార్వతీపురంలో 1928 అక్టోబరు 2 న జన్మించారు. తల్లిదండ్రులు మంథా సరస్వతమ్మ, శిష్టా సాంబశివరావు. పరిశోధక పరమేశ్వరుడు. రచనల రూపంలో ఎంతో పరిశోధన చేశారు. ముప్పైమందికి పైగా విద్యార్థులకు ఈయన మార్గదర్శకత్వంలో డాక్టరేటు ఇప్పించారు. వీరు పరిశోధనకు ఎంచుకునే, విద్యార్థులకు సూచించే అంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. దేశ విదేశాలలో వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేశారు. పలు ఉపన్యాసాలు ఇచ్చారు. సాహిత్యంలో ఇంచుమించు అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. మొత్తం తెలుగు సాహిత్యాన్ని భావితరాలకు చూపించారు. ఈయన రచనా విధానం చూస్తే మొట్టమొదట్లో సంవత్సరానికి ఒక పుస్తకం రాసేవారు. కొంతకాలం తర్వాత సంవత్సరానికి నాలుగైదు పుస్తకాలు కూడా రాసేవారు. ఇవన్నీ గ్రాంథిక భాషలోనే రాశారు. వీటిలో చాలావరకు రచనలు ముద్రించబడ్డాయి. కొన్ని అముద్రితాలుగానే ఉండిపోయాయి. అనేక గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. మరెన్నో సాహిత్య వ్యాసాలు రాశారు.

ఈయన రచనలలో ఒకటైనా **మణిప్రవాళము (వ్యాససంపుటి)** రచనను ఈ వ్యాసంలో చర్చిస్తున్నాను. ఇందులో మొత్తం ఇరవై ఒకటి సాహిత్య వ్యాసాలున్నాయి. ఒక్కొక్క వ్యాసంలో ఒక్కొక్క సాహిత్య ప్రక్రియ కనబడుతుంది. కవితలు, గేయ నృత్య నాటికలు,

కథానికలు, అనువాదాలు, వ్యాకరణం, మహాకావ్యాలు, నవలలు, నాటికలు, యక్షగానవాఙ్మయచరిత్ర, జానపదవాఙ్మయచరిత్ర మొదలైన అంశాలతో కూడిన వ్యాసమాలిక ఈ రచన.

**విశ్వనాథవారి మేనకా విశ్వామిత్రము** అనే వ్యాసంలో జోగారావుగారు మేనకా విశ్వామిత్ర ఘట్టమును విశ్వనాథవారు వర్ణించిన తీరును పేర్కొన్నారు. దీనిని విశ్వనాథవారు విశ్వామిత్రుని కథ అనుట కంటే మేనక కథ అనుటకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలుస్తుంది. మేనకావిశ్వామిత్ర ప్రణయ ఘట్టమును సీతారాముల ప్రణయ ఘట్టముతో పోల్చి చెప్పడం బాగుంది. ఇందుకుగానూ రెండు మూడు సందర్భాలను కూడా వివరించారు. అలాగే సాహిత్యంలో మన సంస్కృతి సంప్రదాయాలను చూపించవచ్చు అనేందుకు ఉదాహరణగా కొబ్బరిచెట్టు వయస్సు లెక్కించడం వంటి సంఘటనలు పేర్కొన్నారు. ఇట్లాంటి తెలుగు సంప్రదాయాలను విశ్వనాథవారి కావ్యాలలో చాలా చూడవచ్చు. విశ్వనాథవారి కథ పాతదైన శిల్పం మాత్రం కొత్తదిగా ఉంటుందని జోగారావుగారు అన్నారు. **రాయప్రోలువారి వైమర్శిక దృక్పథము** అనే మరొక వ్యాసంలో సాహిత్యానికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని గూర్చి, సాహిత్యం-విమర్శ గూర్చి చాలా చక్కగా చెప్పారు. కవి అన్నవాడు తప్పకుండా విమర్శకుడు అయిఉంటాడు, కాని విమర్శకుడు కవి కానవసరం లేదు అనే విషయాన్ని విపులంగా పేర్కొన్నారు. రాయప్రోలువారి మాటలలో 'నేను ప్రాచీనపద్ధతిని నిరసించను కాని నవీనపద్ధతిని ఆదరిస్తాను' అని అనడంలో ఆయనకు కొత్తదనం మీద ఉన్న ఆసక్తిని, ప్రాచీన నవీనులయందు ఉన్న నిష్పాక్షిక సుందరమైన అభిమానాన్ని స్పష్టంగా ఈ వ్యాసంలో చూపించారు. శబ్దార్థాల అనుబంధాన్ని హాయిగా, స్వయంగా అనుభవించినట్టు చెప్పడం రాయప్రోలు వారికే సాధ్యమైందని అన్నారు. మన అనుభూతి పరిధిలో ఉన్న సామగ్రితో చెప్పగలగడం విశేషంగా పేర్కొన్నారు. రాయప్రోలువారి మరొక సిద్ధాంతాన్ని కూడా ఇందులో తెలియజేశారు. నవభావకుల అభిప్రాయం ప్రకారం ఒకే సన్నివేశాన్ని ఇద్దరు నవభావుకులు భిన్నంగా భావించినా అది సమంజసం, సహజం అని వారివాదన. పూవు తుమ్మెదల అనుబంధాన్ని ఒక కవి ప్రేయసి ప్రియుల అనుబంధంగా చెబితే, మరో కవి తల్లిబిడ్డల అనుబంధంగా చెప్తాడు. జోగారావుగారు రాయప్రోలు వారికి గల ఉన్నతమైన కవితాతత్త్వ దర్శనాన్ని ఈ వ్యాసంలో ప్రతిబింబించారు. **కృష్ణశాస్త్రి** వ్యాసంలో ఈయన రచనల వైశిష్ట్యాన్ని తెలియజేశారు. ఆనాటికి ప్రాచీనకవులలో అతినవీనుడు, ఈనాటికి నవీనకవులలో అతిప్రాచీనుడు అయిన కృష్ణశాస్త్రి పాండిత్యాన్ని వివరిస్తూ కుమార గంధర్వుడని కొనియాడారు. భావకవితా భారతరచనకు రాయప్రోలు నన్నయ అయితే కృష్ణశాస్త్రి తిక్కన అని జోగారావుగారు వ్యక్తంచేశారు. **శ్రీశ్రీకి శ్రద్ధాంజలి** అనే మరొక వ్యాసం రాశారు. ఇందులో శ్రీశ్రీ వివిధ సందర్భాలలో కవిత్వం గూర్చి వెలిబుచ్చిన అభిప్రాయాలను, భావాలను వాటి వెనుక ఉన్న ఆలోచనలను పేర్కొన్నారు. శ్రీశ్రీ అభిప్రాయాలలో ఆలోచన కంటె ఆవేశమే ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. ఆధునిక యుగంలో ఒక విశిష్టమైన విలక్ష ణమైన దృక్పథానికి శ్రీశ్రీ ఎంతమేరకు మార్గదర్శకుడైనాడో, అంతమేరకు అవ్యవస్థకు దురవస్థకు బాధ్యుడైనాడని జోగారావుగారి ప్రశంస, అభిశంస రెండూ. శ్రీశ్రీ మహాప్రస్థానం అసలు అచ్చవకముందే దానిమీద మొట్టమొదట సమీక్ష రాశారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయాలలో శ్రీశ్రీ కవితల మీద పరిశోధన చేయమని విద్యార్థులకు మంచి పరిశోధనను సూచించిన వ్యక్తి జోగారావుగారు. శ్రీశ్రీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ వ్యాసాన్ని రాశారు.

**జక్కన కవితాప్రస్థానం** వ్యాసంలో ఒక కవి ఇంకొక కవికి కృతిని సమర్పించుట విశేషంగా పేర్కొన్నారు. జక్కన సిద్ధనమంత్రికి కృతి సమర్పించాడు. తెలుగులో ఇతివృత్త త్రయాన్ని (ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రమము) గుర్తించిన కవి. జక్కన రచించిన విక్రమార్కచరిత్ర గూర్చి వివరించారు. జక్కన తర్వాత కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశికను గూర్చి చెబుతూ ఇందు జక్కన కథాసామ్యములు కలవని గుర్తించారు. అలాగే మాదయగారి మల్లన రాజశేఖరచరిత్ర ప్రబంధంలో కొన్నిమార్పులు చేశాడు. అయినప్పటికీ దీనికి జక్కన కావ్యం నందలి రాజశేఖరుని కథయే మూలం. శైలి విషయంలో శ్రీనాథునికి, జక్కనకు ఒకేవిధమైన పోలికలు కనిపిస్తాయని అన్నారు. తర్వాత **సూరన ప్రతిభ అర్వాచీనకవులపై నతని ప్రభావం** అనే వ్యాసం రాశారు. నన్నయ శ్రీనాథునికి, శ్రీనాథుడు పెద్దనకు పలుకుబడిలో పట్టుబడ్డారు. ఒక్క తిక్కన తప్ప. తిక్కనకు సరియైన అనుయాయి సూరన ఒక్కడే. పలుకుబడిలోనే కాదు, కావ్య శిల్ప ఘటనమున కూడా సూరన తిక్కన వలెనే పట్టుబడిపోవు రకము కాదని పేర్కొన్నారు.

**కవిసన్మానం** వ్యాసంలో కవి అంటే ఎవరు? అనే విషయాన్ని కవిత రూపంలో జోగారావుగారు చెప్పారు. కవి హృదయాన్ని సమ్యగవగాహనం చేసుకోవడం కూడా కవి సన్మానమే అవుతుందని అన్నారు. వాల్మీకి గూర్చి పలు వ్యాఖ్యానాలు, విమర్శలు వెలిశాయే కాని ఆయన గూర్చి ఒక స్మారక సంచిక గాని, శిలా విగ్రహ ప్రతిష్ఠ గాని ఎక్కడ జరిగినట్లు లేదని వాపోయారు. ఇతర దేశాలలో చూస్తే షేక్స్పియరుకు నదీతీరంలో శిలావిగ్రహం ఉంది. ఆయన వాడిన ప్రతివస్తువు భద్రపరచబడ్డాయి. ఒకసారి జోగారావుగారు షేక్స్పియరు మీద ఉన్న అభిమానంతో ఆయన ఊరికి వెళితే ఆక్కడ షేక్స్పియరు పుస్తకాలు, ఆయన గూర్చి ఉన్న బొమ్మల పుస్తకాలు అమ్ముతున్నారు. షేక్స్పియరు అంటే జోగారావుగారికి ఎంత అభిమానం అంటే తన కుమారునికి షేక్స్పియరు అని పేరు పెట్టారు. ఇది ఒకరకంగా జోగారావుగారు షేక్స్పియరుకు చేసిన సన్మానమే అని చెప్పవచ్చు. అలాగే తెలుగు కవుల విషయంలో చూస్తే కొంతమంది కవుల విషయంలో మాత్రమే ఈవిధానం కనబడుతుంది. నెల్లూరులో తిక్కన, శ్రీనాథుల తిరునాళ్ళు ఏటా జరుగుతుంటాయి. తిక్కనకు సంబంధించిన ఇల్లును జాతీయ సంపదగా సేకరించమని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ మూడు ఉత్తరాలు జోగారావుగారు రాశారు. దేనికి సమాధానం లేదు. రాజమండ్రిలో నన్నయపీఠం, గుంటూరులో శ్రీనాథునిపీఠం, ఒంగోలులో ఎర్రనపీఠం, వరంగల్లులో పోతనపీఠం ఉన్నాయి. కందుకూరి, గురజాడ, విశ్వనాథ మొదలైన కవుల విషయంలో జయంతులు, వర్ధంతులు జరుగుతున్నాయి. కాళిదాసు మహాకవికి కార్తీక పూర్ణిమనాడు ఆబ్దిక మహోత్సవం జరుగుతుంది. **ఆంధ్ర విశ్వకళా పరిషత్స్వర్ణోత్సవ సారధి శ్రీ మేకా రంగయ్యప్పారాయ మహోదయ కృతిసమీక్ష!** ఈ వ్యాసంలో రంగయ్యప్పారాయగారి రచనల విశిష్టతలను తెలియజేశారు.

**పాతికేళ్ళ తెలుగు కవిత్వం** అనే మరొక వ్యాసంలో విశ్వనాథ, రాయప్రోలు, వీరేశలింగం, గురజాడ, గిడుగు, శ్రీశ్రీ వంటి కవుల కవిత్వ ధోరణులు వివరించారు. పద్య గేయరచనలు చేసి కొంతమంది రచయితలు క్రమంగా వచన కవితల మీద మక్కువ చూపిన వైనాన్ని పేర్కొన్నారు. సంప్రదాయ అభ్యుదయ మార్గాల గూర్చి చెబుతూ ఈ రెండు కూడా మానవ సమాజ సంక్షేమనే గమ్యం చేరుకోవడానికి పోటీపడతాయని అన్నారు. **ఆధునిక కవితా ధోరణులు** వ్యాసంలో విశ్వనాథవారి కవితా శిల్పంలో నవ్యత్వానికి, దృక్పథంలో సంప్రదాయానికి ఉదాహరణగా ఒక విషయాన్ని ప్రస్తావించారు. కవిత్వంలో పరమ నవ్యుడని పేర్కొన్నారు. ఆధునిక కవులు,

కవిత్వం గూర్చి చర్చించారు. ఇంతవరకు చెప్పిన వ్యాసాలలో ప్రాచీన, ఆధునిక కవులు, కావ్యాలు, కవిత్వం, వారి భావాలు రచనలు గూర్చి విశదీకరించారు. **ప్రక్రియా వైవిధ్యాన్ని, పరిణతిని ప్రదర్శించిన దక్షిణాంధ్ర సాహిత్యం** ఈ వ్యాసంలో దక్షిణాంధ్ర కవుల విశిష్టతలను, రచనలు వాళ్ళు అనుసరించిన పద్ధతులను, రాజుల వృత్తాంతాలు, ప్రజాజీవిత ఉదంతములు, శాస్త్రగ్రంథాలు, స్థలమహాత్మ్యములు, ద్విపదప్రక్రియ, యుగ విశిష్టతలను వివరించారు. దక్షిణాంధ్రరాజులు కవులను తమకై వినియోగించుకున్నారు. కృతి రచన స్వీకృతులు విలాస లాంఛన ప్రాయాలుగా భావించారు. కొంతమంది రాజుల దగ్గర అసలు కవులే ఉండేవారు కాదు. అందుచేత వారి శృంగారమును వారి స్వీయరచనలలో వారే చెప్పుకునేవారు. సాహిత్యాన్ని ప్రజా సన్నిహితము చేసిన యుగం దక్షిణాంధ్రయుగం. విజయనగరం కింద పరిపాలింపబడిన ఆంధ్రసామ్రాజ్యం ఒకానొక కాలంలో తంజాపుర మధురా మండలములలో నాయక రాజుల యాజమాన్యమున ఉంది. అయితే అక్కడి రాజులు మాత్రం ఆచార వ్యవహారాలు తదితర విషయాలు మాత్రం రాయ సామ్రాజ్యమునకు నఖలుగా ఉండేవి. దీనికి సాక్ష్యం అప్పటి సాహిత్యమే అని పేర్కొన్నారు. మరొక వ్యాసం **దేవుని దస్తూరీ.** ఇందులో కళలు, కవిత్వం, సౌందర్యం మొదలైనవాటి గూర్చి వివరించారు.

ఆయన గురువులు గూర్చి, గురు శిష్య సంబంధాలు గూర్చి, వారు సాహిత్యానికి చేసిన కృషిని గూర్చి ప్రస్తావిస్తూ కొన్ని వ్యాసాలు రాశారు. జోగారావుగారు డాక్టరు పట్టపరిశోధన నిబంధానికి ఒక పరీక్షకులు అనంతకృష్ణుడుగారు. వీరిని గురువుగా భావించి వీరిగూర్చి **అనంతకృష్ణుడు** అనే వ్యాసం రాశారు. ఇందులో సంగీత సాహిత్యాలలో అనంతకృష్ణుడుగారి ప్రతిభను తెలియజేశారు. అలాగే జోగారావుగారి మరొక గురువు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు. వీరినిగూర్చి **శర్మగారి ధన్యజీవితం** అనే వ్యాసంలో పేర్కొన్నారు. శర్మగారి హిస్టరీ క్లాసులకు జోగారావుగారు వెళ్లే రోజులు గూర్చి ఇక్కడ చెప్పారు. ఆ రోజులలో బోధనలో వైవిధ్యం, విషయం మీద గాఢత, ధీమా కలిగిన వ్యక్తి శర్మగారు. విజయనగర చరిత్ర పాఠం దృశ్యాలు ఒక్కొక్కటే కన్నులకు కట్టినట్లు ఆవేశంతో చెప్పేవారట. ఆ పాఠాలు విన్నవారంతా పదహారో శతాబ్ది కాలానికి వెళ్ళిపోయేవారట. ఆనాటి మనుషులు అయిపోయేవారు. విజయనగరం పతనం గూర్చి చెప్పేటప్పుడు ఆయనకు సరేసరి - మాక్కూడా సాత్త్వికోదయమయ్యేదని పేర్కొన్నారు. గురు శిష్యులిరువురు మాటల సంభాషణలలో రాజుల చరిత్రల గూర్చి చర్చించుకునేవారని ఈ వ్యాసాన్ని బట్టి తెలుస్తుంది. జోగారావుగారు చరిత్ర గూర్చి ఎన్నోవివరాలు ఈ వ్యాసంలో ప్రస్తావించారు. జోగారావుగారికి శర్మగారిని తలచుకున్నప్పుడల్లా భారత ఇతిహాస కథల్లోని విదుర పాత్రయే అనిపించేదట. **ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాత కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ** అనే పేరుతో మరొక వ్యాసాన్ని కూడా శర్మగారి గూర్చి రాశారు. వైదిక వాఙ్మయ మంతటిని అవగాహన చేసుకుని పరిపూర్ణంగా మహాభాష్యము చేసిన మొదటివాడు విద్యారణ్యుడు. ఇతనికి ఆపేరు ఎలా వచ్చిందో జోగారావుగారు కొన్ని గ్రంథాల ఆధారంగా వారి అభిప్రాయాలను **విద్యారణ్య మహత్వ భూమిక** పేరుతో వ్యాసం రాశారు. **సర్వాంధ్ర** వ్యాసంలో ఆంధ్రజాతి గొప్పదనాన్ని వివరించారు. ఖండ ఖండాంతరాలలో ఆంధ్రప్రజలు విదేశీయులతో వియ్యమందుతూ ఉన్న విషయాల గూర్చి ప్రస్తావించారు. **తరతరాల ..... తెలుగు భాష** వ్యాసంలో యుగాలవారీగా తెలుగుభాష చరిత్రను, గొప్పదనాన్ని విశదీకరించారు. అజ్ఞాతయుగం (ప్రాచీనయుగం), ప్రాఙ్నన్నయయుగం, నన్నయయుగం, అర్వాచీనయుగం, ఆధునికయుగం

మొదలైనవి. ఆధునికయుగంలో వచ్చినమార్పులు గూర్చి చర్చించారు. ఆంగ్ల భాషా సంపర్కం, వ్యావహారిక భాషావాదం, తత్సమం, తద్భవం, అన్యభాషల పదజాలం మొదలైనవి. ఈ వ్యాసంలో జోగారావుగారు తన అభిప్రాయాలను కొన్నింటిని వ్యక్తంచేశారు. కావ్యాలు అందరికీ అర్థం కావాలి అనుకోవడం పొరపాటు. కావ్యభాష లేక గ్రాంథిక భాషలోనే నిత్యవ్యవహారం జరగాలి అన్నచో అది ఎంత అవివేకమగునో కావ్యభాష అంతా వ్యవహారిక భాషలోనే జరగాలి అనుకోవడం అంతే అవివేకం అని ఆయన అభిప్రాయం. **తెలుగు నవల తెన్నులు** వ్యాసంలో నవలా లక్షణాలు, సాంఘిక, చారిత్రక, హాస్య, అపరాధ పరిశోధక మొదలైన నవలలు గూర్చి పేర్కొన్నారు. నవలా వస్తువు మనిషి జీవితంగాని, సాంఘిక చరిత్రగాని అయ్యింది. నవలా రచయితలు వాళ్ళ అభిప్రాయాలను తెలియజేశారు. ఇతర భాషలలోకి తర్జుమా చేయడానికి తగిన తెలుగు నవలలు మూడు నాలుగు కన్నా ఎక్కువ లేవని పి.వి. రాజమన్నారు అన్నట్లుగా ఈ వ్యాసంలో పేర్కొన్నారు.

**నేదునూరి గంగాధరంగారి సెలయేరు పీఠిక**లో జానపద వాఙ్మయంలో కృషి చేసిన వారందరినీ ప్రస్తావించారు. వాఙ్మయసేవలో జీవితమే ఒక ఉద్యమంగా గడిపినవారు నేదునూరివారు. వీరికి పాత పాటల గంగాధరం అనే మరో వ్యవహారం ఉన్నట్లుగా పేర్కొన్నారు. జానపద పాటల సేకరణలో ఉన్న కష్టనష్టాలను వివరించారు. గంగాధరంగారు సేకరించిన పల్లెపాటలు, స్థానికగాథలు, పొడుపుకథలు, మాండలికపదాలు, సామెతలు, అన్ని కలిపి అచ్చులో నాలుగువేల పేజీలయ్యే గ్రంథం వస్తుందనే విషయాన్ని చెబుతూ వారి కృషిని తెలియజేశారు. **ఆంధ్ర సారస్వతశాఖలో యక్షగానము ప్రత్యేకత** వ్యాసంలో ఆంధ్రజాతీయ సంగీత వాఙ్మయ రచనకు కొలమానం యక్షగానం అని పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వతశాఖలో యక్షగానము ప్రత్యేకతను వివరించారు. యక్షగాన ప్రక్రియలో వస్తు వైవిధ్యం కలదని ఇంతటి వైవిధ్యం కలిగిన ప్రక్రియ మరొకటి లేదని అన్నారు. ఆంధ్ర ఛందస్సు సంహితా సర్వసము తయారగు అవకాశం వచ్చినచో దానికి అపురూపమైన సామగ్రిని చాలా సరఫరా చేయగలదు. యక్షగానము నందు పుస్తకాల కెక్కని పదజాలము, ప్రయోగవిశేషములు, జాతీయాలు మొదలైనవి కలవు. సాహిత్యాన్ని ప్రజలకు దగ్గర చేసి ప్రజల హృదయాన్ని సాహిత్యంలో ప్రతిబింబింపజేసిన ప్రక్రియ యక్షగానం. ఇందులో కేవలం సన్నివేశములు మాత్రమే కాదు, కథా వస్తువులు కూడా పూర్తిగా లోకసిద్ధములైన సందర్భాలే ఉంటాయి.

**ముగింపు**

పాఠకులకు ఆసక్తిని కలిగించే అంశాలతో, విషయాలతో ఈ మణిప్రవాళము వ్యాససంపుటి ఉంది. కవితలలో గాని వచనంలో గాని అధిక ప్రసంగాలు, వర్ణనలు కనిపించవు. విషయ స్పష్టతతో కూడిన వ్యాసావళి. తెలుగుజాతి, భాష, నాగరికత, వేదాలు, కావ్యాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు గొప్పదనాన్ని వర్ణించిన తీరు బాగుంది. నవల, కథ, జానపద, యక్షగాన వాఙ్మయ చరిత్ర గూర్చి తెలియజేశారు. చారిత్రక అంశాలు కూడా రుజువులతో చూపించారు. తెలుగు సంప్రదాయాలతో కూడిన కవులు కావ్యాల గూర్చి విశదపరిచారు. అలాగే ఆధునికధోరణులు కలిగిన కవులు, రచనలు గూర్చి పేర్కొన్నారు. చరిత్రకు సంబంధించిన అంశాలతో పాటుగా భాషకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలు గూర్చి తెలియజేశారు. ఒక్క శతక

ప్రక్రియ తప్ప సాహిత్యంలోని మిగిలిన అన్ని ప్రక్రియలు మణిప్రవాళము రచనలో కనిపిస్తాయి. విషయం గ్రాంథికంలో ఉన్నప్పటికి విషయ స్పష్టతో కూడిన లఘువాక్యాలు ఉండటం వలన సులభంగా అర్థమయ్యే రీతిలో రచన ఉంది. సాహిత్యం మానవ సంస్కృతికి ఒక ఆయుధం వంటిది. ఇది విశ్వజనీనమైన ఆనందాన్ని పాఠకుని అనుభూతికి తెస్తుంది. యస్వీ జోగారావుగారి ఈ మణిప్రవాళము సాహిత్య రచన కూడా పాఠకులకు అదే అనుభూతుని అందిస్తుంది.

●●●

COMMENTS